అతడు తీసుకున్న
ఆ నిర్ణయం
చివరికెలా
పరిణమించింది?

# రాపేటి రామకృష్ణారావు కథ

# చివరి మజిలీ

వెంకటరావుకి స్వతహాగా తోచదు. మరొకరు చెబితే వినదు. అతడికి తోచిందే చేస్తాడు. వెంకటరావు లాంటివాళ్ళు చిక్కుల్లో పడితే నలుగురి సానుభూతి కూడా దొరకదు. ముందే చెరుపు చెయ్యాలని, చెరుపు జరిగితే చూడాలని చూసే జనం.

"ఎవరికి చెప్పి చేశాడండీ. చేసుకున్న వారికి చేసుకున్నంత మహాదేవ. అనుభవించనియ్యండి" అంటారు.


ఒకవేళ అలాంటివాడు బాగుపడ్డా "నా మొహం బాగులెండి. నలుగురిలో కలవడు. మహాకోపిష్టి. అహంకారం ఎక్కువ. ఎందుకండీ అలాంటి బాగు ఎవడు మోసుకుపోయాడండీ" అని ఏడుస్తారు.

వెంకటరావుని తెలిసినవాళ్ళు 'అతనొక మొండిఘటం' అని కూడా అంటారు.

నడివయసులో అతను తీసుకున్న ఒక్క నిర్ణయం మహా కఠోరమైంది. అంత కఠోర నిర్ణయం ఎందుకు తీసుకున్నాడో ఎవరికీ అర్థం కాలేదు.

అందరూ ఏకకంఠంతో 'నీకిది తగదు. తప్పు జరిగిందేదో జరిగిపోయింది. ఎందరు ప్రేమవివాహాలు చేసుకోవడంలేదు. నీకొడుకు నీ కోడల్ని రప్పించుకో. హాయిగా వుండండి' అని చిలక్కి చెప్పినట్టు చెప్పారు. వినలేదు. తాడుని తెగేదాకా లాగాడు.

చెవిటివాని ముందు శంఖం పూరించినట్లయిందే తప్ప అతను వినలేదు. అతని నిర్ణయం మారలేదు. అలాంటి నిర్ణయం ఏ తండ్రీ తీసుకోలేదు. అలాంటిది వెంకటరావు ఎలా తీసుకున్నాడు? ఆ నిర్ణయం అతనే తీసుకున్నాడా? లేక విధి నిర్ణయమా?



వెంకటరావు విధివంచితుడా! అనే అనుమానం అతని హితులకి, సన్నిహితులకి కూడా కలిగింది.

ఆ నిర్ణయమే చివరికి అతడ్ని ఏకాకిని చేసింది. అతని ఆస్తి, ఐశ్వర్యం ఎందుకూ కొరగాకుండా పోయింది.

అన్నీవుండి కూడా చివరిమజిలీలో ఒంటరిగా మిగిలిపోయాడు.

ఓ నలభై సంవత్సరాల క్రితం వెంకటరావు హైదరాబాద్‌కు పొట్ట చేత్తో పట్టుకుని పెళ్ళాం, కొడుకూ, కూతుర్ని వెంటేసుకుని విజయవాడ నుంచి హైదరాబాద్ చేసుకున్నాడు. అప్పటికింకా హైదరాబాద్‌ని నిజాం పరిపాలిస్తున్నాడు. చాలా చవకరోజులు.

వెంకటరావు కాస్త చదువుకున్నవాడు కావడంచేత ఓ కాంట్రాక్టర్ దగ్గర గుమస్తాగా చేరాడు. నెలకు యాభై రూపాయల జీతం, వుండడానికో ఇల్లు ఇచ్చాడు. కాంట్రాక్టర్ మంచివాడు గనుక వెంకట్రావుని తనతోపాటు ఎదగనిచ్చాడు.

పదేళ్ళు తిరిగేసరికి నాంపల్లి ప్రాంతంలో వెయ్యిగజాల స్థలంలో ఓ ఇల్లు, నాలుగు ప్లాట్లు, పట్టణానికి పడమటకుగావున్న గుడిమల్కాపురం దగ్గర ఓ పదెకరాల భూమి కొన్నాడు. అతను పట్టినదల్లా బంగారమైంది.

వెంకట్రావు ఎంత సంపాదిస్తున్నా ఏనాడూ నాకేమని కూర్చోలేదు. కర్మయోగిలా ఒకో మెట్టు ఎక్కుతూ శ్రమిస్తూనే పోయాడు. కోటీశ్వరుడయ్యాడు. మూడుతరాలు కూర్చునితిన్నా తరగని ఆస్తి సంపాదించాడు. భవనాలు, కార్లు, నౌకర్లు, చాకర్లు ఏర్పడిపోయారు.

మనిషి అన్నిట్లోనూ ముందడుగులో ఎప్పుడూ వుండలేడు. కొన్నిట్లో ఎంత మొనగాడైనా, ఎంత సమర్థుడైనా వెనక పడక తప్పదు. అదే సృష్టి విచిత్రం.

వెంకట్రావు జీవనరంగంలో బయట ధనం సంపాదించాడు. కానీ ఇంటిని అశ్రద్ధ చేశాడు. భార్య, పిల్లల కోసం తగినంత సమయం కేటాయించలేక పోయాడు. మొక్కప్పుడే వంచని మొక్కల్లాగా వాళ్ళబ్బాయి, అమ్మాయి కూడా క్రమశిక్షణ లేకుండా అడ్డదిడ్డంగా పెరిగారు. వెంకటరావు భార్య సుశీల వాళ్ళని తగినరీతిలో వంచలేకపోయింది. ముద్దుచేసి వాళ్ళడిగిందల్లాల సమకూర్చి వాళ్ళిష్టమొచ్చినట్లే పెంచింది.

పదేళ్ళలో హైదరాబాద్ నడిబొడ్డులో చక్కని ఇల్లు కట్టానన్న సంతృప్తిని సుపుత్రుడు ఆనంద్ టెన్త్ ఫెయిలై చెడగొట్టాడు.

పదిహేనేళ్ళలో కారు కొన్నానన్న తృప్తి లేకుండా కూతురు నీరజ కూడా అదే పని చేసింది. వెంకట్రావు మనశ్శాంతి కరువుకి అక్కడే బీజాలు పడ్డాయి. వాళ్ళు వరసగా తప్పడంచేత ఆ బీజాలు మొలకలెత్తి వటవృక్షాలుగా పెరిగి మనశ్శాంతిని తినెయ్యసాగాయి.

అలా ఎందుకు జరుగుతుందో వెంకటరావుకి అర్థంకాలేదు. అతడు పిల్లల్ని ఎప్పుడూ నెత్తిన ఎక్కించుకోనూలేదు. కోప్పడి దండించనూలేదు.

అతడు సర్వతోముఖాభివృద్ధి సాధించాలని కలలుకన్నాడు. తను వాళ్ళకి తక్కువ చేసేందేమీ లేదు. ట్యూషన్లు పెట్టించాడు. తన చిన్నప్పుడు అగాకి, కాణీకి గతి లేకపోయినా భార్య రోజుకి పదేసి రూపాయలు పాకెట్‌మనీ ఇస్తున్నా పట్టించుకోలేదు. మరెందుకు వీళ్ళిలాగా తయారయ్యారు. ఎందుకని అందరిలాగా తెలివిగా చదువుకుని పాసవరు. కొడుకు ఇంటరు పాసైతే చాలు ఇంజనీరింగ్ సీటు కొనేవాడు. కూతురు ఇంటర్ పాసైతే చాలు మెడిసన్ సీటు

కొనేసేవాడు. మరెందుకు వీళ్ళు తన కోరిక తీర్చరు. ఏమీలేని వాళ్ళే చదువుకుని పైకొస్తుంటే అన్నీవున్న వీళ్ళకేం తెగులొచ్చింది అనుకునేవాడు. పిల్లలిద్దరి మీద ప్రేమ నశించింది. వాళ్ళు కనిపిస్తే చాలు ఎలర్జీ. వాళ్ళు తింటున్నప్పుడు చూసినా, వీధిలో తిరుగుతున్నప్పుడు కనబడినా అసహ్యం వేసేది.

చూస్తూచూస్తూ వుండగానే ఇరవైయేళ్ళు గడిచిపోయాయి. పిల్లలు యుక్తవయస్సుకొచ్చారు. వాళ్ళక చదివి ఉద్ధరించేది లేదు. ముందు కూతుర్ని ఓ మంచి అల్లుడికిచ్చి పెళ్ళిచేసి తరువాత కొడుకు పెళ్ళి చేద్దామనే నిర్ణయానికొచ్చాడు వెంకట్రావు. అప్పుడే ఓ సంఘటన జరిగింది. అదే వెంకట్రావు జీవితాన్ని మలుపు తిప్పింది.

ఆ రోజుని వెంకట్రావు ఇంట్లో ఎవరూ మరిచిపోలేరు.


వెంకట్రావు కొడుకు ఆనంద్ తానొక అమ్మాయిని ప్రేమించానని, పెళ్ళి చేసుకుంటానని అతని భార్య సుశీలతో చెప్పడం విన్నాడు. వెంకట్రావుకి కోపం కట్టలు తెంచుకుని వచ్చింది. గుర్రం గుడ్డిదైనా దానాకి లోటులేదని ఇల్లంతా గుల్లచేస్తూనే వున్నాడు. వీడికితోడు ఓ జోడు కావాల్సి వచ్చింది అనుకున్నాడు.

"ఇదుగో సుశీలా! వీడిప్పుడప్పుడే పెళ్ళి చేసుకోవడానికి నేనొప్పుకోను. ముందు నీరజ పెళ్ళి కావాలి. తరువాత వీడిపెళ్ళి. అదీ వీడు జీవితంలో ప్రయోజకుడై నాలుగు రాళ్ళు సంపాదించడం మొదలుపెట్టిన తరువాతే" అని కొడుకు వినేలాగా భార్యతో స్పష్టంగా చెప్పాడు.

తండ్రీ, కొడుకు ముఖాముఖి మాట్లాడుకోవడం ఎప్పుడో మానేశారు.

ఆనంద్‌కి తండ్రిమీద కోపం వచ్చింది.

చిన్నప్పట్నుంచీ చూస్తున్నాడు. ప్రేమగా ఏనాడూ చేరదీసింది, కష్టం సుఖం మాట్లాడింది లేదు. వ్యాపార, లావాదేవీల్లో



కలుగజేసుకోనివ్వడు.

ఆఫీసు రూముకి వెళ్ళినా మాట్లాడడు. చదువు తన వంటికి పడదని తెలుసు. అలాంటప్పుడు ఓ లక్ష రూపాయలు తన ముఖాన్ని పారేస్తే ఏదైనా వ్యాపారంచేసి ఆ మాత్రం సంపాదించుకోలేడా. తనెందుకు తనకినచ్చిన పిల్లని చేసుకోకూడదు. ఈ ధోరణిలో వెళ్ళాయి ఆనంద్ ఆలోచనలు.

ఏమైనా సరే ప్రళయం సంభవించినా సరే తనకినచ్చిన పిల్లని తను ఇప్పుడే చేసుకుంటాడు. అంతే. ఆనంద్ వెంటనే పెళ్ళిచేసుకోవడానికే నిర్ణయించాడు.

తండ్రీ కొడుకుల తగవుల మధ్య సుశీలకు చావొచ్చినట్లయింది. ఎవరూ చెప్పిన మాట వినరు.

ఓ రోజు మధ్యవయస్కులైన దంపతులు వెంకట్రావు ఇంటికి వచ్చారు. ఆనంద్ వాళ్ళని సోఫాలో కూర్చోబెట్టి వాళ్ళమ్మకి పరిచయం చేశాడు. వాళ్ళ పేదరికం వాళ్ళ వేషాల్లో కనిపించింది. సుశీలలో వాళ్ళమ్మాయిని ఆనంద్‌కివ్వడానికి వాళ్ళకెలాంటి అభ్యంతరం లేదని చెప్పారు. సుశీల ''మీ అమ్మాయిని చేసుకుంటాం'' అని అడగడానికి వచ్చే తల్లిదండ్రుల్నిచూసింది. ''మా అమ్మాయిని చేసుకోండి'' అని అడగడానికి వచ్చే తల్లిదండ్రుల్ని మొదటిసారి చూసింది.

దానిక్కారణం సుశీలకి తెలుసు. తన భర్త వెంకట్రావు పెళ్ళిచూపులకి పచ్చినా వెళ్ళరు. అందుకే ఆనంద్ అలాంటి పనిచేశాడు అనుకుంది.

తన బెడ్‌రూమ్‌లో పేపరు చదువుకుంటున్న వెంకటరావుకి ఎవరో అతిథులు వచ్చిన అలికిడై బయట హాల్లోకి వచ్చాడు. జరుగుతున్నదేమిటో అర్థమైంది.

వెంకటరావుకి ముక్కుసూటి తనమేగాని సభ్యతపాటించే తత్వం మొదటినుంచీలేదు. ఆనంద్‌కి కాబోయే అత్తమామలమీద అరిచాడు.

''నేను వాడికెప్పుడప్పుడే పెళ్ళిచెయ్యను నా కిష్టమైనప్పుడు చేస్తాను. ముందు బయటికి నడవండి'' అన్నాడు.

వాళ్ళు అవమానభారంతో వెళ్ళిపోయారు.

ఆనంద్‌కి తండ్రిని ఎదిరించే ధైర్యంలేదు. వాదించే సాహసంలేదు. కాని మొండితనంలో తండ్రిని మించిన తనయుడు.

శుభలేఖలు వేయించాడు. తల్లికి చూపించి ''నాకు నచ్చిన అమ్మాయి, నన్ను మెచ్చిన అమ్మాయి పేద పిల్లయినా అందం గుణం చూసి చేసుకుంటున్నాను. మీరు వచ్చి ఆశీర్వదించండి'' అని చెప్పాడు.

వెంకట్రావుకి అది కొడుకు చేసిన సవాల్ లాగ అనిపించింది. ఏమి చూసుకుని అంత ధైర్యం చేస్తున్నాడో! అర్థంకాలేదు.

తనకి కొడుకు పుట్టలేదు. ఈరోజుతో చచ్చాడు అనుకున్నాడు. ''సుశీలా వాడిపెళ్ళికి నేను వెళ్ళను. మీరు వెళ్ళడంకూడా నాకిష్టంలేదు. తరువాత మీ ఇష్టం. పెళ్ళయిన మరునాటినుంచీ వాడు ఈ గడపతొక్కడానికి వీల్లేదు. దయచెయ్యమను'' అన్నాడు.

ఆనంద్ కోపంగా నిష్క్రమించాడు.

సుశీలకి బాధవేసింది. ఎప్పుడూ భర్తకి ఎదురు చెప్పాలంటే భయమే. కాని తెగించి

నాలుగు మాటలు చెప్పాలనుకుంది.

"ఎందుకండీ ఇలాటి నిర్ణయాలు తీసుకుంటారు. మీరుమాత్రం నిరుపేదనైన నన్ను అందర్నీ ఎదిరించి చేసుకోలేదా కట్టుబట్టలతో పిల్లల్ని తీసుకుని ఇక్కడికి రాలేదా. వాడికే బుద్ధొస్తుంది. పెళ్ళిచేసుకుంటే వాడే తన బాధ్యత తెలుసుకుంటాడు. ప్రయోజకుడౌతాడు. ఉన్న ఒక్కడ్నీ దూరం చేసుకుని మనమెలా బ్రతుకుతాం. ఈ సంపాదించిందంతా ఎవరికోసం" అంది.

"నాతో వాదించకు. నిన్ను పెళ్ళిచేసుకున్నాను. హైదరాబాద్ కట్టుబట్టల్తో వచ్చాం. నిజమే నేనిప్పుడింతవాడ్నయ్యాను. నా ఇష్టానికి వ్యతిరేకంగా పెళ్ళిచేసుకుంటున్నాడు గనక నాలాగే సంపాదించుకుని బ్రతకమను "అంతే" అన్నాడు వెంకట్రావు.

ఆనంద్ నిజంగానే కట్టుబట్టలతోనే వెంకట్రావు మనస్సులోంచి కూడా నిష్క్రమించాడు. తండ్రి తన పెళ్ళికి రాడని తెలుసు. కాని తల్లీ చెల్లీ రాకపోయినందుకు బాధపడ్డాడు.

సుశీలకి కొడుకు సమాచారం అందుతూనే వుంది. పెళ్ళిచేసుకుని అత్తవారింట్లోనే కాపురం పెట్టాడు. ఆనంద్ మామగారు బడిపంతులు. రిటైరైన తర్వాత వచ్చిన డబ్బు కూతురుకిచ్చాడు. వాళ్ళందరూ విజయవాడ మకాం ఎత్తేశారు. ఆనంద్ ఏదో దుకాణం తెరిచాడు.

హైదరాబాద్ ఏ పనిమీద వచ్చినా తండ్రిలేని సమయంలో ఇంటికి వెళ్ళి తల్లినీ చెల్లినీ చూసి వెళ్ళిపోయేవాడు.

వెంకట్రావుకి ఆ సంగతి తెలిస్తే "వాడు నాయింటికెందుకు వచ్చాడు. ఏ ముఖం పెట్టుకువచ్చాడు సిగ్గులేకుండా" అని తిట్టేవాడు.

సుశీల మాతృహృదయం రోదించేది.

ఆనంద్‌కి రోజులు కలిసిరాలేదు. వ్యాపారంలో నష్టం వచ్చింది. ఉద్యోగం చెయ్యడానికి చదువులేదు. మరో వ్యాపారానికి పెట్టుబడిలేదు.

## చీర!



కామాక్షిని ఆసక్తిగా అడిగింది మీనాక్షి "ఆ వెలిసిపోయిన చీరకి రంగెందుకు వేయించడం?"

"స్టీలు గిన్నెలవాడికి వేయటానికి!"

"ఆ...!"

—సాయిగంగాధర్ చామర్తి (విజయవాడ)

ఆ సందర్భంలోనే తన అహాన్ని చంపుకు ని తండ్రి వెంకట్రావుకి ఓ ఉత్తరం రాశాడు.

''నాన్నగారూ! మీ మాటకాదని పెళ్ళిచేసుకుని తప్పుచేశాను. కాని నేనిప్పుడు కష్టాల్లో వున్నాను. పెళ్ళాన్ని పోషించుకోలేని స్థితి ఓ యాభైవేలు అప్పుగానైనా సర్దితే జీవితంలో స్థిరపడగానే ఇచ్చేస్తాను. మీలాగే కష్టపడిపైకొద్దామని మీకు నా తఢాకా చూపిద్దామనే అనుకున్నాను. కాని ఇవి మీ రోజులు కావు. ప్రతీ రంగంలోనూ పోటీ ఎక్కువైంది. ధనం పరపతీ రెండూ కావాలి. అవి రెండూ నాకు మీరే. క్షమించి నాకు మీరీ సాయం చెయ్యండి.

మీ కుమారుడు
ఆనంద్

వెంకటరావులో తండ్రి అప్పటికింకా మేలుకోలేదు. తండ్రికి రావలసిన స్పందన రాలేదు. పైపెచ్చు వెంకటరావుకి ఆ వుత్తరంలో పెద్ద చిత్రం ఏమీ కనిపించలేదు. అలాంటి ఉత్తరం ఏదో వస్తుందనే అనుకున్నాడు. తన మాట వినవందుకు తగిన గుణపాఠం చెప్పాలనే నిశ్చయించుకున్నాడు.

భార్యని సంప్రదిస్తే ఏమి చెపుతుందో తెలుసు. ఎటువంటి పరిస్థితుల్లోనూ సాయం చెయ్యదలుచుకోలేదు.

కాగితం కలం తీసుకున్నాడు.

ఆనంద్‌కి నీ ఒకప్పటి తండ్రి వెంకట్రావు నేను నీకెలాంటి సాయం చెయ్యలేను. నామాట కాదని పెళ్ళిచేసుకున్నావు. అనుభవించు. నీలాంటివాళ్ళు చాలా మంది వుంటారు ఈ లోకంలో... ఎందరికని సాయం చెయ్యగలను సారీ.

ఇట్లు
వెంకట్రావు

ఆనంద్ అలాంటి సమాధానాన్ని ఆశించలేదు. డబ్బుపంపకపోయినా కనీసం నీ భార్యని తీసుకుని వచ్చెయ్యి తండ్రిగా నాకు తప్పుతుందా అని రాస్తాడనుకున్నాడు. తండ్రి ఎంత పాషాణ హృదయుడో అర్థమైంది.

ఆనంద్ మళ్ళీ తండ్రికి ఉత్తరం రాయలేదు. మళ్ళీ ఎలాంటి సమాధానాన్ని వెంకట్రావు ఆశించలేదు.

మరో ఏడాది గడిచిపోయింది.

ఓరోజు ఉదయాన్నే గర్భవతి అయిన భార్యని తీసుకుని ఆనంద్ హైదరాబాదులోని వెంకట్రావు ఇంటికి చేరుకున్నాడు.

ఆనంద్ భార్యకి పురుడు కూడా పోయించలేని స్థితి. అత్తమామలకున్న డబ్బు తనే ఆర్పేశాడు. అందుకని ప్రత్యక్షంగా తన పరిస్థితి చూస్తే తండ్రి మనసు కరుగుతుందని భార్యతో ఓ బికారిలాగ తండ్రి తలుపుతట్టాడు.

వెంకట్రావే తలుపు తెరిచాడు.

ఎదురుగా కొడుకు. గర్భవతి అయిన కోడలు అతనికి జాలికలగలేదు. పైగా కోపం వచ్చింది.

''ఏముఖం పెట్టుకొని వచ్చావురా. కొడుకుగా నీ స్థానం ఎప్పుడో పోయింది. గడప తొక్కావో చంపేస్తాను'' అన్నాడు. వెంకటరావు కళ్ళు రక్తగోళాల్లాగ వున్నాయి. తండ్రిని ఓ హంతకుడిగా మార్చడం ఇష్టంలేదు ఆనంద్‌కి.

కళ్ళనీళ్ళపర్యంతమై ''ఈ చంపేదేదో

పుట్టగానే చంపెయ్యకపోయావా నాన్నా! ఎందుకు పెంచావు'' అన్నాడు బయటినుంచే. ఆనంద్ భార్యకూడా కళ్ళు వత్తుకోసాగింది.

''బుద్ధిలేక ఏదో ఉద్ధరిస్తావని. ఇలా ఉద్ధరించావు. గోటు హెల్. అంత చాతకాని వాడివి పెళ్ళెందుకు చేసుకున్నావు. పెద్ద మగవాడ్ననుకున్నావుగదా. ఆ మగతనం ఇప్పుడు చూపించు వెళ్ళు'' అని అరుస్తూ తలుపులు మూసేశాడు.

ఆనంద్ భార్య భయపడిపోయింది. లంకంత కొంప ఏ మూలనన్నా చోటివ్వకపోతారా అనే ఆశతో వచ్చింది. ఆశ్రయం లభించలేదు.

ఇక రోడ్డేగతి. వచ్చిన త్రోవనే వెళ్ళిపోయారు. ఆనంద్ హృదయం ఎంత గాయపడిందో తెలియదు మళ్ళీ కనిపించలేదు.

మరో పదేళ్ళు ఎవ్వరి ప్రమేయం లేకుండానే గడిచిపోయాయి.

* * *

కొడుకుని వెళ్ళగొట్టిన తరువాత వెంకటరావు కూతుర్ని బాగానే చూసుకునేవాడు. నీరజకి అన్నయ్యకు జరిగిన అవమానం జ్ఞాపకం వుంది. ఆనాటి తండ్రి ప్రవర్తనని ఎంతగానో అసహ్యించుకుంది. ఆ ఇంటికి దూరంగా పెళ్ళయితే చాలు పారిపోదామని వుండేది.

వెంకటరావు ఓ మంచి సంబంధం చూసి నీరజ పెళ్ళి చేశాడు. అల్లుడికి ఢిల్లీలో ఉద్యోగం. నీరజ కాపురానికి వెళ్ళిపోయింది. సుశీలను ఒంటరితనం ఎక్కువైంది.

కొడుకు ఆచూకీ తెలియకపోవడం. కూతురు దూరంగా వెళ్ళిపోవడం ఎప్పుడూ వ్యాపార వ్యవహారాల్లో మునిగి తేలుతూ మనసు విప్పి మాట్లాడని భర్త ప్రవర్తన సుశీల కృంగదీశాయి.

మనోవ్యాధితో సుశీల కాలంచేసింది. వెంకటరావుకి ఓ యేదుగడ, ఓ వృద్ధుడిచేతి కర్ర పోయినట్లయింది.

వెంకటరావుకి మొదటిసారి దుఃఖం వచ్చింది. మొదటిసారిగా కొడుకు జ్ఞాపకం

## పంది ఏనుగు!?



మొన్నీ మధ్యన కోహిమాలోని ఓ పంది ఆ పట్టణంలో పెద్ద కలకలాన్ని సృష్టించింది. ఆ పంది అయిదు మామూలు పిల్లలతో పాటు, ఏనుగును పోలిన తొండం ఉన్న పిల్లను కూడా కన్నది! కోహిమా వెటర్నరీ హాస్పిటల్ డాక్టర్ రేంగ్మా, చెబుతున్నదాన్ని బట్టి... అప్పుడప్పుడు ఇలా విపరీత ఆకారాలలో పంది పిల్లలు పుట్టడం అసహజం కాదట! ఏది ఏమైనా... ఇదో అరుదైన సంఘటన! ప్రస్తుతం కోహిమా పశువుల ఆసుపత్రిలో ఉన్న ఈ పంది ఏనుగును చూడటానికి ప్రజలు తండోపతండాలుగా వస్తున్నారట!

— జూపిటర్

వచ్చాడు. ఎక్కడున్నాడో. చిరునామా తెలిస్తే రమ్మని టెలిగ్రామ్ ఇచ్చేవాడే. కూతురికి టెలిగ్రామ్ ఇచ్చాడు.

నీరజ వచ్చింది. సుశీలకి అంత్యక్రియలు జరిగాయి. పెద్దఖర్మకాగానే భర్తతో ఢిల్లీ వెళ్ళిపోయింది. మాటవరసకి కూడా వాళ్ళ నాన్నని ఢిల్లీకి రమ్మనలేదు.

వెంకటరావు మనసుగాయపడింది. తనకిలా కావలసిందే అని మొదటిసారి అనిపించింది. అతనిలో పశ్చాత్తాపం బయలుదేరి దహించసాగింది.

అతనికిప్పుడు ఆస్తిపాస్తులు ఇళ్ళూ భూములూ తృణప్రాయంగా కనిపిస్తున్నాయి. కొడుకు కావాలి. కోడలు కావాలి. వాళ్ళ పిల్లలు కావాలి. అంతే. దొరికితే క్షమాపణ అడగాలి. ఇంట్లోకి తెచ్చుకోవాలి. అదే తపనతో కొడుక్కోసం ఆరాలు తియ్యడం మొదలుపెట్టాడు.

ఓ రోజు ఆనంద్ మిత్రుడు వెంకట్రావుని కలిశాడు. ఎప్పుడో ఓల్డ్ సిటీలో చార్మినార్ అవతల ఓ సైకిల్‌షాపులో పనిచేయడం చూశానని చెప్పాడు.

వెంకటరావు ఎగిరి గంతేశాడు. గబగబా కారు మీద బయలుదేరాడు. చార్మినార్‌దాటి, ఔట్‌సైడ్ అలియాబాద్ దాటి ఓ నూరుమూల సందులో ఆనంద్‌మిత్రుడు చెప్పిన సైకిల్ షాపుని కనుక్కున్నాడు.

నాలుగు సరుగుడు తాడ్లకి ఓ వెదురు తడికె పైకప్పుగా బిగించి వుంది నాలుగుపాత వైర్లు కొన్ని సైకిలు రిపేరు చేసే పనిముట్లు, పంచరుచేసే సొల్యూషన్ వున్నాయి.

ఫుట్‌పాత్ ప్రక్కన అదివరకు అలాంటి వాళ్ళనెందర్నో చూశాడు.

ఓ పదేళ్ళ కుర్రాడు సైకిలుకి గాలికొడుతున్నాడు. వెంకటరావుకారు దిగాడు.

"నీ పేరిమటి బాబూ" అడిగాడు.

"వెంకట్" చెప్పాడాకుర్రాడు.

ఈ నిష్కృష్టుడి పేరే పెట్టాడా

"మీ నాన్న పేరు?"

"ఆనందరావు మీకేంకావాలి?" అడిగాడు.

పుట్టెడు జాలేసింది. తన మనవడు గతిలేని వాడిలాగ సైకిళ్ళకి గాలికొడుతున్నాడు. ఈ లెక్కన సుకుమారంగా పెరిగిన ఆనంద్ ఎన్నికష్టాలు పడ్డాడో. ఇక నన్ను క్షమించడు అనుకున్నాడు.

"మీ నాన్నేడిబాబూ" అడిగాడు. కన్నీళ్ళాపడంలేదు. ఇలాంటి వాళ్ళనెందర్నో చూశాడు. మరి ఈ మమకారం కలగలేదే. ఇదేనా రక్తసంబంధం అంటే! వృద్ధాప్యం. కళ్ళద్దాల మీద కన్నీరు తొణికి తడిసి ఏమీ కనిపించలేదు.

"లేరండీ! మా అమ్మానాన్నగారు మా తాతయ్య చనిపోయారని తెలిసి విజయవాడ వెళ్ళారు.

"మరి నువ్వెళ్ళలేదేం."

"మా సైకిలుషాపు చూసుకోవాలి గదండీ" అన్నాడు.

వెంకట్రావు గుండె తరుక్కుపోయింది.

"బాబూ నేను మీ తాతయ్య వెంకట్రావుని. పద మన ఇంటికి పోదాం. రా కారెక్కు" అన్నాడు.

"ఈరోజు సాయంత్రమో రేపొద్దున్నో

మా అమ్మానాన్న వస్తారు మీరు రేపు రండి. అందరం కలిసే వస్తాం'' అన్నాడు.

''అలాగే! ఇదుగో ఈ వందరూపాయలు వుంచు'' అని ఇవ్వబోయాడు.

వెంకట్ 'వద్దండీ' అని తిరస్కరించాడు.

'సరే నేనొచ్చానని చెప్పు. రేపొస్తాను'' అని కారుమీద బయలుదేరి వెళ్ళిపోయాడు. ఆ రోజు వెంకటరావు నిద్రపోలేదు.

మరునాడు ఉదయాన్నే కారు మీద సైకిలు షాపుకి వచ్చాడు. కాళీగావుంది. ఎవ్వరూ లేరు.

ప్రక్కనే వున్న దుకాణం ఆయన ఉత్తరం ఒకటి తెచ్చి వెంకట్రావుకిచ్చాడు. గబగబా తెరిచాడు.

వెంకటరావు గారికి,

నాన్నా అని సంబోధించనందుకు క్షమించండి. నేనొక దిక్కులేని అనాధను. నాకు మీలాంటి తండ్రి వుంటే ఇలా వుండను. మీవల్ల అమ్మ ప్రేమకు నోచుకోక అమ్మని కూడా చూడలేకపోయిన దరిద్రుడ్ని. ఒక ప్రయోజకుడ్నయి అమ్మకి కనిపిద్దామనుకున్నాను. నాకా అదృష్టంలేకపోయింది. అమ్మపోయిందని తెలిసింది. బ్రతికుండగా అమ్మకి ఏమీ చేయలేకపోయిన నేను చచ్చిన తరువాత ఏంచెయ్యగలను. మాలో మేమే రోదించాం. మైల తీర్చుకున్నాం. మీ మీదనాకు కోపంలేదు. ఎవరి ఖర్మకి ఎవరు బాధ్యులు. నాకు బ్రతకడం నేర్పారు. నేను ఈనాడు రోజుకి ఓ యాభైరూపాయలు సంపాదించుకోగలుగుతున్నానంటే అది మీ చలవే. ఈనాడు నాకు ఆస్తులమీద అంతస్తులమీద మోజులేదు. మీ ఆస్తి మీ స్వార్జితం. నేను దాన్ని ముట్టుకోమన్నా ముట్టుకోను. మీ ఇష్టంవచ్చినట్టు చేసుకోండి. దేశంలో నాలాంటి అనాధలెందరో వున్నారు. వారికి సాయపడండి. ఎన్నాడైతే నిండు చూలాలైన నా భార్య ఎదురుగానే నన్ను అవమానించారో ఆనాడే మన బంధం తెగిపోయింది. మళ్ళీ మీరు నన్ను కలుసుకోవాలన్నా కలుసుకోలేరు.

రెక్కాడినవాడికి డొక్కాడుతుంది. మరో ఊళ్ళో లేదా మరోపట్టణంలో ఎక్కడైనా బ్రతికగలననే నమ్మకం నాకుంది. మీరు నిశ్చింతగా వుండండి.

సెలవు

ఇట్లు

ఆనంద్

ఉత్తరం చదివి వెంకట్రావు నిర్వీణ్ణుడయ్యాడు. అలా ఆఖరి మజిలీలో తోడు కావలసిన వయసులో వంటరిగా మిగిలిపోయాడు.

*



## బాధ

బంగారమ్మతో అనునయంగా చెప్పింది తాయారమ్మ "అలా బాధపడుతూ కాపురం చేసేకంటే మీ ఆయనకి విడాకులిచ్చేయొచ్చు కదే'' "విడాకులిచ్చి ఆయన్ని సుఖంగా బతకనుని ఎలా వదిలేయమంటావే!'' కస్సుమంది బంగారమ్మ.

—కె.సత్యరాజ్ (గొల్లల మామిడాడ)